

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 4 సంచిక : 16 పుష్పం : 20 ఎడిటర్ : శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 8-1-99, గుండుగొలను)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవంతునికి ఒకరూపంలేదు, ఒకనామం లేదు. రూపంలేని, నామంలేని వస్తువుని మనంపట్టుకోలేము. ఎందుచేతనంటే మనం ఒక నామానికి ఒక రూపానికి పరిమితమై ఉన్నాము. మనకి జీవితం పొడుగునా రూపబుద్ధి, నామబుద్ధి ఎక్కువ. ఎంతసాధన చేసినా ఈ రెండింటిలోనుండి విడుదల పొందలేకపోతున్నాము. భగవంతుడికి రూపం అక్కరలేదు కాని మనకోసం ఆయన ఏదో రూపంలో ప్రవేశిస్తాడు. రూపంలేని, నామంలేని పరమాత్మతో మనకు పరిచయం కుదరటం కష్టం. పరమాత్మయొక్క లీల ఎలా ఉంటుందో, ఆయన కళ్యాణగుణాలు ఎలా ఉంటాయో మనకు చూపించటానికి భగవంతుడు కృష్ణరూపం ధరించి వచ్చాడు. భగవంతుడిని ఆరాధించగా ఆరాధించగా, ప్రార్థించగా ప్రార్థించగా భగవంతుడే గురురూపం ధరించి వస్తాడు. ఎన్ని గ్రంథాలు చదివినా అవి అన్నీ మొదట చెప్పినది ఏమిటి అంటే ఇంద్రియ నిగ్రహం, మనోనిగ్రహం. శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం కాపాడుకొంటూ నీ హృదయంలో అంతర్యామిగా ఉన్న భగవంతుడిని దర్శించటమే వాటి సారాంశం.

ఏ వస్తువుకయితే పుట్టుకలేదో, ఏవస్తువుకయితే మరణంలేదో ఆ వస్తువును తెలుసుకోవటానికి ఇంద్రియ నిగ్రహం అవసరం, మనోనిగ్రహం అవసరం, ఈశ్వరునియందు ప్రేమ, భక్తి అవసరం. ఇవి లేకుండా నీలోపల ఉన్న వస్తువు నీకు తెలియబడదు. ఒక విషయం గురించి మీకు చింత ఉంది అనుకోండి, బెంగ ఉంది అనుకోండి. శరీరం ఉండగానే దానిని పరిష్కరించుకోవాలి లేకపోతే శరీరం చనిపోయిన తరువాత బెంగ అలాగే ఉండిపోతుంది. బెంగ శరీరంలో ఉండదు, మనస్సులో ఉంటుంది. శరీరం చనిపోతుందిగాని మనస్సు అలాగే ఉంటుంది. అందుచేత మనస్సులో ఉన్న బెంగ శరీరం మరణించిన తరువాత మీకూడా వచ్చేస్తుంది. శరీరం మరణించిన తరువాత మరల కొత్త శరీరం వచ్చేవరకు జీవుడు ఊగిసలాడుతూ ఉంటాడు. కొత్త శరీరాన్ని పట్టుకోలేడు, పాత శరీరాన్ని మరచిపోలేడు. మనకున్న అలవాట్లు వ్యక్తం కావాలంటే శరీరం లేకుండా వ్యక్తం కాదు. కొత్త శరీరం రావటానికి కొంత కాలం పడుతుంది. కాని ఎన్ని సంవత్సరాలు పట్టినప్పటికి మనస్సులో ఉన్న గుణాలు అలాగే ఉంటాయి. నీ శరీరం ఉండగా కృషి చేసి ఆధ్యాత్మికంగా ఎంతవరకు అభివృద్ధిలోనికి వచ్చావో ఆ అభివృద్ధి నిలుస్తుందిగాని మరణానంతరము నీకు సాధన కుదరదు. బహుజన్మలు కృషి చేస్తేనేగాని నీకు ఆత్మజ్ఞానం కలుగదు. నీ హృదయంలో ఉన్న భగవంతుడిని ధ్యానం చేస్తే, ఏది అయితే నీవు అవునో దానిని ధ్యానం చేస్తే అది నీవు అవుతావు. కాని నీవు శరీరాన్ని

ధ్యానం చేస్తున్నావు, మనస్సును ధ్యానం చేస్తున్నావు. అవి నీవు కాదు కాబట్టి వాటిని ధ్యానం చేసినా అవి నీవు అవ్వవు.

నీ శరీరానికి మరణం వస్తుందిగాని నీ మనస్సులో ఉన్న సమస్యలకు మరణం రాదు. వాటిని నీవే పరిష్కరించుకోవాలి. పారిపోవటానికి ప్రయత్నం చేయవద్దు. ఇల్లు వదిలివేసి, ప్రపంచాన్ని వదిలేసి పారిపోయినంత మాత్రంచేత జ్ఞానంరాదు. ధైర్యం వహించి వాటిని ఎదుర్కొని పరిష్కరించుకోవాలి. ఏమతసారమైనా పని, ఆరాధన, నీకు ఉన్నదానిలో ఇతరులతో పంచుకొని తినటం. ఒకో దేహానికి ఒకోపనిని ఇస్తాడు భగవంతుడు. మీకు ఇష్టం ఉన్నా, లేకపోయినా భగవంతుడు ఇచ్చిన పనిని చేసుకొంటూ పోవాలి. ఒకవేళ తప్పించుకోవటానికి ప్రయత్నం చేస్తే అదే పనిని రాబోయే జన్మలో ఇస్తాడు, వడ్డీతో సహా అనుభవించాలి. లోకం గొడవలకు దగ్గరగా ఉంటే లోకవాసన పెరిగిపోతుంది. పని ఎంతవరకు అవసరమో అది చేసుకొంటూ నీవు స్థిరంగా, నిర్మలంగా, నిశ్శబ్దంగా ఉండు. ఇతరుల గొడవలో కలుగజేసుకోకు. పనే ప్రధానం కాదు. భగవంతుని ఆరాధించటం మర్చిపోకు. భగవంతుని పూజద్వారా, జపంద్వారా, ధ్యానం ద్వారా ఆరాధించు. భగవంతుని పాదాలను ఆశ్రయించు. నీ అహంకారానికి అనేక తలంపులు, ఆలోచనలు వస్తాయి కాని ఈశ్వరసంకల్పం ప్రకారమే ఈ సృష్టి జరుగుతూ ఉంటుంది. ఎవడైతే నీకు, నాకు, ఈసృష్టికి కర్తో వాడిని ఆశ్రయించు, వాడి పాదాలను విడిచిపెట్టకు. నీ చేతిలో ఉన్న పనిని విడిచిపెట్టవద్దు. పనిద్వారా, మాటద్వారా ఆరాధించవచ్చు. భగవంతుడు నీకు ఇచ్చిన అవకాశములను సద్వినియోగం చేసుకొంటే ఉదాత్తమైన, ఉత్తమమైన జీవితం వస్తుంది. నీకు ఉన్నదంతా నీది కాదు ఈశ్వరుడిదే. ఈశ్వరుడు ఇచ్చాడుకాబట్టి నీకు వచ్చింది లేకుంటే నీకు రాదు. ఈశ్వరుడే ఇతర రూపాలలో కూడా ఉన్నాడు కాబట్టి నీకు ఉన్నదానిలో ఇతరులతో పంచుకొని తిను. ఏమతసారం అయినా ఇదే. ఇది అర్థం చేసుకొని జీవిస్తే మరల పునర్జన్మలోనికి వెళ్ళవలసిన పనిలేదు. ఇతరులు నీగురించి ఏమనుకొంటున్నారు అనేది ప్రధానంకాదు. ఇతరులు నీగురించి ఏమనుకొంటున్నారు అనే ధోరణిలో ఉంటే నీకు అహంభావన పెరుగుతుంది. ఒకసారి భగవాన్‌తో మాఆశ్రమం గురించి రకరకాలుగా చెప్పకొంటున్నారు అని ఒకరు అంటే ఒక్కొక్కడికి ఒకో బుద్ధి ఉంటుంది. ఎవడి బుద్ధిని బట్టి వాడు చెప్పకొంటాడు కాని ఇంకోరకంగా వాడు ఎలా అనుకొంటాడు అన్నారు భగవాన్. వాడు అనుకొనేది నిజమా? నిజాన్ని నీవు తెలుసుకోవాలిగాని నీవు అనుకొనేది నిజంకాదు.

భగవంతుని ఆరాధించటం నిన్ను ఎందుకు వదలవద్దు అని చెపుతున్నారు అంటే నీవు ఆరాధించగా ఆరాధించగా నీవు ఆరాధించే భగవంతుడు వాడికి శరీరం అక్కరలేకపోయినా నీకు నామబుద్ధి, రూపబుద్ధి ఉందికాబట్టి నీకోసం ఒకరూపం ధరించి, నామం ధరించి నీతో పరిచయం ఏర్పాటు చేసుకోవటానికి నీదగ్గరకు వచ్చి నీతో మాట్లాడతాడు. వాడియొక్క కృప నీకు సోకినంత మాత్రం చేత నిన్ను అజ్ఞానం అనే నిద్ర నుండి మేల్కొలుపుతాడు వాడే గురువు. నీ తలంపుల నుండి, ఊహలనుండి, నీదేహబుద్ధి అనే అడవి నుండి నిన్ను విడుదలచేసి నీకు సత్యం వైపుకు దారిచూపించేవాడే గురువు. నీప్రయత్నం, నీతెలివి అవసరమేకాని వాటి

వలన ఈ అడవిలో నుండి బయటకు రాలేవు. దానికి ఈశ్వరుని కృప అవసరం. జాగ్రదావస్థ, స్వప్నావస్థ, గాఢనిద్ర ఇవి మాకు తెలుస్తున్నాయి. మాకు తెలిసినది మేము కాదు అని అంటున్నారు. మీ లోపల సత్యం ఉంది అని చెపుతున్నారు. అది మాకు తెలియటంలేదు. మాకు తెలియనది మేము అంటున్నారు. మేము కానిదానిని మేము అని ఎందుకు అనుకొంటున్నాము అని భగవాన్‌ను అడిగారు. ఇది ఒక అలవాటు జన్మజన్మలనుంచి ఇలా అలవాటు పడిపోయావు. ఇది నిజంకాదు. ఈ అడవిలో నుండి బయటకు రావటానికే గురువు అవసరం. శరీరం పుట్టినప్పడు పుట్టాను అనుకొంటున్నావు, శరీరం మరణించినప్పడు మరణిస్తున్నాను అనుకొంటున్నావు. శరీరమే నీవు అనుకోవటం వలన ఇవి అన్నీ నిజం అనుకొంటున్నావు. నీవు వీటిని ఎంత సత్యం అనుకొంటున్నావో అవి అంత అసత్యం. నీవు ఎవరుగా ఉన్నావో ఆవస్తువుకు పుట్టుకలేదు, మరణంలేదు. మేము ఎప్పడూ ఇలా ప్రయత్నం చేస్తూ ఉండవలసిందేనా అని ఒకరు భగవాన్‌ను అడిగితే నీవు ప్రయత్నంలేని స్థితికి వెళ్ళేవరకు ప్రయత్నం చేయవలసిందే. ఎప్పడూ చేయనక్కరలేదు. ప్రయత్నంలేని స్థితికి వెళ్ళిన తరువాత ప్రయత్నం నిన్ను వదిలేస్తుంది. మీ హృదయంలో అమృత స్థితి ఉంది. దానిని తెలుసుకోవటానికి గురువుపట్ల, ఈశ్వరునిపట్ల తెంపులేని, ఎడతెగని భక్తి కలిగి ఉండాలి. It is god who does everything. ప్రతీదీ భగవంతుడే చేస్తున్నాడు అని నీకు అర్థమయ్యేవరకు, అదినీకు అనుభవం లోనికి వచ్చేవరకు నేను చేస్తున్నాను, నావలననే అవుతోంది అని గంతులు వేస్తావు, బడాయిలు చెపుతావు. ఈ దేహం ద్వారా ఈశ్వరుడు నిర్ణయించిన పనిని చేస్తున్నావు. నీకు ఏమి స్వతంత్రములేదు. నీవు అస్వతంత్రుడివి.

భక్తి పెరగాలంటే రాగద్వేషములు తగ్గించుకోవాలి. రాగద్వేషములు మనస్సను బాహ్యముఖం చేస్తాయి. రాగద్వేషములు వదిలివేస్తే మనస్సు తన మూలంలో పడిపోయి రాలిపోతుంది. మంచి, చెడ్డ అనేది కూడా నీమనస్సులో ఉన్న బేధం నీహృదయంలో ఉన్న వస్తువులో ఏమీ బేధం లేదు. ఆ వస్తువును తెలుసుకొనే వరకూ దుష్టులతోనూ, దుర్మార్గులతోనూ స్నేహం చేయవద్దు, వారితో మాట్లాడటం తగ్గించుకో. వారిమీద ద్వేషంతోకాదు నీహృదయంలో ఉన్నవస్తువును తెలుసుకోవటం కోసం వారికి దూరంగా ఉండాలి. బేధం అంతా మనస్సులోనే ఉంది అసలు వస్తువును తెలుసుకొన్నాక నీకు అంతా సమానమే, అంతా ఒక్కటే. మొక్క చిన్నగా ఉన్నప్పడు కంచె వేస్తాము. పెద్దదయిన తరువాత తీసివేసినా ఇబ్బందిలేదు. సాధనదశలో అటువంటి కంచెకూడా నీకు అవసరమే. సత్పురుషులతో సహవాసం చెయ్యి. దాని వలన నీవు తక్కువ ప్రయత్నంతో ఎక్కువ ఆధ్యాత్మిక అభివృద్ధిని పొందుతావు. భగవాన్ శరీరం విడిచిపెట్టేటప్పడు కృష్ణబిక్షు ఒకపాట వ్రాసారు. ఇప్పడు ఈ శరీరంలో ఎలాగ ఉన్నారో అటువంటి శరీరాలు భవిష్యత్‌లో మీకు రావాలని నేను కోరుకొంటున్నాను అని వ్రాసారు. అప్పడు భగవాన్ ఇంతకాలం నాబోధనలు విని నాకు జన్మలు రావాలని కోరుతున్నావు ఏమిటి అన్నారు. జన్మలు కోరుతున్నాను కాని అది మీకోసం కాదు మాకోసం మీకు శరీరం అవసరం లేదు అని నాకు తెలుసు. కాని ఈశరీరానికి, మనస్సుకి అతీతంగా ఉన్న వస్తువు మాకు తెలియటంలేదు. అది మాకు తెలిసేవరకూ మీకు

శరీరాలు రావాలని నేను కోరుకొంటున్నాను అని కృష్ణభిక్షు చెప్పారు. గురువు అలా చూస్తే, మౌనంగా బోధిస్తే అనేకమంది జ్ఞానులు అయినవారు ఉన్నారు కాని అది అందరికి సాధ్యం కాదు.

జీవితంలో ఏది జరిగినా అది మీమంచికే జరుగుతోంది అనుకోండి. భగవంతుడు మీ జీవితాన్ని ఎప్పడు, ఎక్కడ ఎలా మలుపు త్రిప్పతాడో చెప్పలేము. మీకు జీవితంలో జరిగే ప్రతీ సంఘటన ఈశ్వరునికి తెలియకుండా జరగటంలేదు, ఇది అంతా ఈశ్వర సంకల్పముతోనే జరుగుతోంది. ఈ విషయం నీకు అర్థంకాకపోవటం వలన నేనే చేస్తున్నాను, నావలనే అవుతుంది అనుకొంటావు. నీవలన ఏమీ అవ్వదు. నీకు అహంభావన ఉంది కాబట్టి అలా అనిపిస్తుంది. ఆధ్యాత్మికంగా అభివృద్ధి అవ్వాలనే అభిలాష నీకు బలీయంగా ఉన్నప్పడు ఈశ్వరుడే నీకోసం శరీరం ధరించి వస్తాడు. మోక్షం పొందాలి అనే తపన మనహృదయంలో లేదు. ఏదో మెకానికల్‌గా పూజలు, జపాలు చేస్తున్నాముగాని మోక్షం పొందాలి అనే తపన మనలో బలీయంగా లేదు. మోక్షం పొందాలనే కాంక్ష మనలో బలీయంగా ఉంటే గురువు యొక్క విశిష్టత, ఈశ్వరుని యొక్క ఔన్నత్యం మీకు తెలుస్తుంది. మరణంలేని వస్తువు నీకు తెలిసేవరకూ నీవు మరణానికి గురి అవుతూనే ఉంటావు. ఒక శరీరం వచ్చాక ఆశరీరంలో కొత్త కోరికలు, సంకల్పాలు పెంచుకొని మరల కొన్ని వందల శరీరాలకు ఈశరీరం ఆధారం అవుతుంది. వడ్డుకు వచ్చాక వచ్చాము అనుకోవాలిగాని ఈలోపుగా మాయలోనుండి బయటకు వచ్చాము అనుకోవటానికి అవకాశంలేదు. భగవంతుడు కూడా శరీరం ధరించి వస్తాడు. మనలా ఏడుస్తూరాడు ఆయన ఆనందంతో శాంతితో శక్తితో వస్తాడు. ప్రతీ కదలిక, ప్రతీ చూపు, ప్రతీమాట ఆనందమే. శరీరం అంతా ఆనందమే, ఎక్కడ చూసినా మధురమే, మధురాతి మధురం ఎందుచేతనంటే నీలోపల ఉన్న సత్యవస్తువే ఆరూపం ధరించి వచ్చింది. అందరిలోను దేవుడు ఉన్నాడు అని లౌకికులతోను, దుష్టులతోను కలిసి తిరగవద్దు. మీరు సంపాదించుకొన్నది పోతుంది. ఆత్మజ్ఞానం పొందేవరకు సమాజం విషయంలో బహు జాగ్రత్తగా ఉండాలి. భగవంతుడు శరీరం ధరించి వచ్చి ఆయనను ఆశ్రయించినవారిని తరింపజేయ టానికి వారితో మాట్లాడతాడు, వారితో కలిసి తిరుగుతాడు. ఆయనలో ఐక్యం చేసుకొనే ప్రయత్నం చేస్తున్నాడని వారికి తెలియదు. ఆ చైతన్య స్రవంతిలో ఆనంద సముద్రంలో లీనం చేసుకోవటానికి మనతో మాట్లాడతాడు, మనపై ఆగ్రహిస్తాడు, చిరాకుపడతాడు ఏది చేసినా అవి అన్నీ మనకోసమే చేస్తాడు. ఇది తెలిసినవారు అదృష్టవంతులు, తెలియనివారు దురదృష్టవంతులు. కొంతమంది ఉత్తమోత్తములు ఉంటారు. కూపబుద్ధి నామబుద్ధి లేనివారు ఉంటారు. వారికోసం ఈశ్వరుడు దేహం ధరించనక్కరలేదు, ఒక జ్యోతిరూపంగా దర్శన మిచ్చి వారిని ఆయనలో ఐక్యం చేసుకొంటాడు.

గురువును ఎలా ఎన్నుకోవాలి అని భగవాన్‌ను అడుగుతున్నారు. ఎంతోమంది మహాత్ములు, యోగులు ఉండవచ్చు. కాని నీమనస్సు ఎవరితోనైతే శృతి కలుపుతోందో, ఎవరిపట్ల మీమనస్సుకు అనురాగం కలుగుతోందో, ఎవరి మాట పట్ల మీకు ప్రీతి కలుగుతోందో అతడే నీగురువు అని నిశ్చయించుకో. గురువు శాంతిగా ఉంటాడు, ఓర్పుగా ఉంటాడు, క్షమ

కలిగి ఉంటాడు. ఎవరి ద్వారా నీవు తరించే యోగం ఉందో వారిపట్ల నీకు అనురాగం ఏర్పడుతుంది, ఆపుకోలేని ప్రేమ కలుగుతుంది. గురువు పట్ల నీకు ఆకర్షణ ఉండవచ్చు కాని గురువు యొక్క స్వరూపం నీకు తెలియాలంటే తెలియబడదు. నీవు ఎవరో నీకు తెలిస్తేనే గురువు ఎవరో నీకు తెలియబడతాడు. గురువు అంటే ఆత్మ. నీవూ ఆత్మవే. నన్ను సరిదిద్ది ఆయన స్వరూపం నాకు ఇవ్వటానికి గురువు ఎన్నో జన్మల నుండి నన్ను వెంటాడుతున్నాడు అన్న సంగతి నీవు ఆత్మవు అని తెలిసాక నీకు తెలుస్తుంది, అది గురువు యొక్క వైభవం. ఈ లోకాన్ని అంతా, లోకంలో ఉన్న మనుషులనంతా నీగురువుగా చూడగలిగితే నీగురువు మీద నీకు నిజంగా ప్రేమ ఉన్నట్లు గుర్తు. మీకు నిజంగా గురువు మీద భక్తి ఉంటే అందరిని గురురూపంగా చూడటం నేర్చుకోండి.

మీకు ఎంతసేపు లోకం గురించి తెలుసుకోవాలి అని ఉంటుంది. ఇరుగు పొరుగువారి గురించి తెలుసుకోవాలి అని ఉంటుంది. దేవుడిని గురించి తెలుసుకోవాలి అని ఉంటుంది. ఏమనస్సుతో అయితే లోకాన్ని తెలుసుకోవాలి అనుకొంటున్నావో, ఏ మనస్సుతో అయితే దేవుని తెలుసుకోవాలి అనుకొంటున్నావో ఆ మనస్సుయొక్క మూలం గురించి తెలుసుకోవాలనే బుద్ధి కూడా నీకు కలగటం లేదు. ఇదే మహామాయ. లోకంలో గొడవలు అన్నీ నీకు కావాలి. చనిపోయిన తరువాత ఏ లోకాలకు వెళతామో ఆ గొడవలు కావాలి. అన్నీ కావాలి కాని నీవు ఎవడో నీవు తెలుసుకోవాలనే బుద్ధి నీకు కలుగదు. ఇదే మహామాయ, ఇదే అజ్ఞానం. అది తెలుసుకోవాలి, ఇది తెలుసుకోవాలి అనుకొంటాము. ఈ తెలుసుకోవాలనే నేను గురించి తెలుసుకొందామనే సంకల్పంకూడా నీకు రావటంలేదు. ఇవి అన్నీ తెలుసుకోవటానికి నీలో ఒకడు ఉండాలి. వాడు ఎవడో తెలుసుకోవాలనే బుద్ధి నీకు కలగటంలేదు. ఇదే మూర్ఖత్వం. ఎవరిమీద అయితే నీకు విశ్వాసం ఉందో, ఎవరిని స్మరించుకొంటూ ఉంటే నీమనస్సుయొక్క చాపల్యం తగ్గుతుందో వారిని గురువుగా ఎంచుకొని నీవు ప్రయాణం చేయటం ప్రారంభించు. వారు అలా అన్నారు, వీరు ఇలా అన్నారు అనుకోవద్దు. ఈ విషయంలో రాజీ పడకు. ఒక్క అడుగుకూడా ముందుకు వేయకుండా నేను ప్రయాణం చేస్తున్నాను అని అనుకోకు. దూరం ఎంత ఉన్నా ఇబ్బంది లేదు అసలు నడుస్తూ ఉంటే తరిగిపోతుంది. నీకు నిజంగా మోక్షం కావాలంటే వస్తుంది. అబద్ధం అబద్ధంగా కోరుకొంటేరాదు. నీకు నిజంగా మోక్షం కావాలా నీకాంక్ష సత్యమా, అసత్యమా అనేది నీలోపల ఉన్న భగవంతుడు చూస్తూ ఉంటాడు. నీకాంక్ష నిజమైతే ఆయనే గురురూపం ధరించి వస్తాడు, నిన్ను ఆకర్షించుకొంటాడు, నీకు తెలియ కుండానే ఆయన స్వరూపాన్ని నీకు ఇస్తాడు. శరీరం ఉండటానికి నీడ, ఆహారం, బట్ట అవసరమే. ఈ ప్రాథమిక అవసరాలు నీకు ఉన్నప్పుడు మిగతా కాలమంతా మోక్షస్థితిని పొందటానికి నీవు ఎందుకు ప్రయత్నం చేయటంలేదు అంటే దాని విలువ నీకు తెలియటం లేదు.

నీవు ఉన్నావు. నీవు ఉన్నావన్న సంగతి నీకు తెలియటం లేదు. అది తెలుసుకోవటమే జ్ఞానం. అసలు వస్తువును తెలుసుకొనే వరకూ, ఉండటం అనేది నీకు అర్థమయ్యే వరకు ఈ అసూయలు, కంక్షలు, ఈర్ష్యలు మిమ్మల్ని వెంటాడుతూనే ఉంటాయి. అసలు సత్యానికి మనల్ని మోసుకొని పోవటానికే భగవాన్ మాటలు. మనకు అర్థమయినా, కాకపోయినా

మాట చెప్పి ఉంచితే ఈ జన్మలో కాకపోయినా నాలుగు జన్మల తరువాత అయినా అర్థం చేసుకొంటాము అని చెప్పి విడిచిపెట్టాడు. వాడే గురువు. ఏదయితే మనం మంచి అనుకొంటున్నామో అవే ఉపద్రవాలు తెచ్చి పెడతాయి అని మీకు తెలియటంలేదు. జీవితంలో ఎప్పుడూ ఇలాకలిసి ఉంటాము అని అనుకోవద్దు. ఎప్పుడైతే కలియక ఉందో అప్పుడు విడిపోవటం కూడా ఉంటుంది. అన్నదమ్ములు, భార్యాభర్తలు విడిపోతారు, మనం ఎంతో ప్రేమిస్తున్న వస్తువులు విడిపోతాయి. నీ దేహంతోనే నీవు విడిపోతున్నప్పుడు బాహ్యంగా ఉన్న వస్తువులతోను, వ్యక్తులతోను విడిపోతావని నోటితో చెప్పటం ఎందుకు అన్నాడు బుద్ధుడు. మరణానంతర జీవితంలో మనం ఒంటరిగా ప్రయాణం చేయాలి. పిలిచిన వారికి అందరికి ఉద్యోగాలు ఇవ్వరు. సెలెక్టు చేసుకొన్నవారికే ఉద్యోగాలు ఇస్తారు. అలాగే మనందరము మోక్షంకోసం ప్రయత్నం చేసినా ఇవ్వడు. ఎవరికైతే అర్హత ఉందో వారికే ఇస్తాడు. ఒకవేళ అర్హత లేకుండా ఇచ్చినా మనం తట్టుకోలేము. అలాగని మనలని విడిచిపెట్టడు. మనం ఏస్థితిలో ఉన్నామో అక్కడ నుండి సాధన కొనసాగించేలా జన్మను ఇస్తాడు. నీవు ఎక్కడ ఉన్నా నిన్ను ఆకర్షించుకొని, ఆయన బోధ యొక్క విలువనీకు తెలియజేసి, నీచేత ఆచరింపజేసి ఆయన స్వరూపాన్ని నీకు ఇచ్చేవరకూ నీతోటి జన్మిస్తూనే ఉంటాడు. వాడే గురువు. ఇతరుల మీద మీకు ఉన్న ప్రేమ నిజమైతే అది పని రూపంలో వ్యక్తమవుతుంది. నిజమైన గురువు నీలోపలే ఉన్నాడు. నీతలంపులను చూస్తాడు. నీవు ఎందుకు మాట్లాడుతున్నావో, ఎందుకు పని చేస్తున్నావో చూస్తాడు. నిన్ను గమనిస్తూ ఉంటాడు. నీలో ఉన్న బలహీనతలను ఎప్పుడు ఎక్కడ తొలగించాలో చూస్తూ ఉంటాడు. కాలంకోసం చూస్తాడు. కాల పరిపక్వత వచ్చినప్పుడు నీఆధారాలు అన్నీ ఊడగొట్టి ఆయన స్వరూపమైన మోక్షాన్ని ఇస్తాడు. గురువు నిన్ను విడిచిపెట్టే సమస్యలేదు.

నీవు సాంప్రదాయబద్ధంగా పూజ చేసుకోవచ్చు, ధ్యానం చేసుకోవచ్చు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే నీవుకాని దానిని ఎంత ధ్యానం చేసినా అది నువ్వు అవ్వవు. ఏదైతే నీవు అవునో దానిని ధ్యానం చెయ్యి. దుర్మార్గులను కూడా నువ్వు మంచివారు అని అనుకోవచ్చు. నీవు అనుకొన్నంత మాత్రంచేత వారు మంచివారు అవ్వరు. చివరకు వారి దుర్మార్గంలో నీవు పడతావు. అదేవిధంగా నీవుకాని దానిని కూడా నిజం అని నీవు నమ్మవచ్చు. నీవు నమ్మినంత మాత్రంచేత అది నిజం అవ్వదు. ఏదైతే నిజమో దానిని ప్రేమించు, ఏదైతే నిజమో దానిని ధ్యానించు, దాని కోసం జీవించు. ధ్యాసలేకుండా ధ్యానం రాదు. ఎక్కడయితే నీకు ప్రేమ ఉందో అక్కడే నీమనస్సు వాలుతూ ఉంటుంది. నీకు నిజంగా ఈశ్వరునిపట్ల ప్రేమ ఉంటే అనుకోకుండా నీమనస్సు అక్కడ వాలుతుంది. నీకు ధ్యాసకుదురుతుంది. ధ్యాసద్వారా ధ్యానం కలుగుతుంది. ప్రేమలేకుండా హృదయం యొక్క లోతులు పెరగవు. It is God who does everything. చేసేది అంతా భగవంతుడే ఈ విషయం ముందు నీకు అర్థంకావాలి.

PRINTED & PUBLISHED BY P.S. RAMARAJU AT SHRIRAM GRAPHICS, PALAKOL